## క్లుప్తంగా

### వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నేత సుభాష్‌చంద్రబోస్



పైల సుభాష్ చంద్రబోస్‌కు పార్టీ కండువా వేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

ఏలేశ్వరం: వైఎస్సార్ సీపీలో చేరికలు కొనసాగుతున్నాయి. ఏలేశ్వరం పట్టణానికి చెందిన సీనియర్ టీడీపీ నేత పైల సుభాష్‌చంద్రబోస్ శుక్రవారం వైఎస్సార్ సీపీలో చేరారు. మేమంతా సిద్ధం బస్సుయాత్రలో భాగంగా వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు, ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ సమక్షంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పైల సుభాష్‌చంద్రబోస్‌తో పాటు పలువురికి పార్టీ కండువాలను వేశారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని వారికి సూచించారు. పార్టీలో చేరిన వారిలో టీడీపీ పట్టణాధ్యక్షుడు సతివాడ రాజేశ్వరరావు, పైల అయ్యప్ప, కె.సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

### సంక్షేమ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించండి

కిర్లంపూడి: కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో మళ్లీ గెలిపించండి అని వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం కోడలు తోట శ్రీనిధి పిలుపునిచ్చారు. మండలంలోని గోనేడలో శుక్రవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నేత పలెకల గంగరాజు ఆధ్వర్యంలో స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్‌గుర్తుపై ఓటువేసి జగ్గంపేట ఎమ్మెల్యేగా తోట నరసింహాన్ని గెలిపించాలని కోరారు. పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### ఘనంగా పండిత సదస్యం



రత్నగిరిపై రామాలయంలో వేదసదస్యం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరి క్షేత్రపాలకులు సీతారాముల దివ్యకల్యాణ మహోత్సవాల్లో భాగంగా మూడోరోజు శుక్రవారం రత్నగిరి రామాలయంలో వేదపండిత సభ (సదస్యం) నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు పెళ్లిపెద్దలు సత్యదేవుడు, అమ్మవార్లు వెంట రాగా నవదంపతులు సీతారాములను రామాలయంలోని గర్భాలయం నుంచి మండపంలోకి తీసుకువచ్చి వెండి సింహాసనంపై ప్రతిష్ఠించారు. వారి పక్కనే మరో ఆశనం మీద పెళ్లిపెద్దలు సత్యదేవుడు, అమ్మవార్లను ఆశీనులను చేశారు. తొలుత విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, సరస్వతీ పూజ నిర్వహించారు. అనంతరం సీతారాముల సమక్షంలో వేదపండిత సదస్యం నిర్వహించారు. సీతారాములకు పండితులు పట్టువస్త్రాలను సమర్పించారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేయగా, దేవస్థానం వేదపండితులు నాలుగు వేదాలు వల్లించారు. సీతారాములకు నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు.

### కొనసాగిన ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన పూజలు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ఆలయంలో నూతన స్వర్ణధ్వజస్తంభం ప్రతిష్ఠాపన పూజలు, హోమాలు రెండోరోజు శుక్రవారం కొనసాగాయి. పాత ధ్వజస్తంభం నుంచి సేకరించిన కళలను ఇత్తడి బిందెలో నిక్షిప్తం చేసిన విషయం విదితమే. వాటికి శుక్రవారం క్షీరాధివాసం నిర్వహించారు. సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం, సాయంత్రం యాగశాలలో హోమాలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్య శర్మ దంపతులు, ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన వ్యయాన్ని భరిస్తున్న నెల్లూరుకు చెందిన దాత దంపతులు ఈ పూజల్లో పాల్గొన్నారు. ఏఈఓ కృష్ణారావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### మూడు చెక్‌పోస్టుల ఏర్పాటు

ప్రత్తిపాడు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గంలో మూడు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్టు ప్రత్తిపాడు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్రీనివాసరావు తెలిపారు. ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం స్టాటిక్ సర్వేలైన్స్ టీం సభ్యులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని శంఖవరం మండలం నెల్లిపూడి జంక్షన్, ప్రత్తిపాడు జాతీయ రహదారిపై అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద, యర్రవరంలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. ఈ చెక్‌పోస్టుల వద్ద జాతీయ రహదారిపై ప్రయాణించే ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తారన్నారు. అధిక మొత్తంలో నగదు, సామగ్రి తరలిస్తే స్వాధీనం చేసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి తహసీల్దార్లు ఎస్.నరసింహరావు, వి.రాజకుమారి, సీహెచ్ విద్యాపతి, డిప్యూటీ తహసీల్దార్ టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



తునిలో ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం జగన్, మంత్రి దాడిశెట్టి రాజా, చిత్రంలో ఎంపీ అభ్యర్థి సునీల్



తునిలో సీఎం జగన్‌కు హారతులు ఇస్తున్న మహిళలు



కత్తిపూడిలో బస్సుయాత్రకు వచ్చిన జనవాహినిలో ఓ భాగం



తునిలో సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు

# అడుగడుగునా నీరాజనం

**సంక్షేమ సారథి, జనహృదయ నేత, తమ అభిమాన నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కళ్లారాచూసి మెట్టసీమ వాసులు పులకించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి జగమోహన్‌రెడ్డి చేస్తున్న మేమంతా సిద్ధం బస్సుయాత్ర శుక్రవారం జగ్గంపేట, ప్రత్తిపాడు, తుని నియోజకవర్గాల్లో పండగలా సాగింది. అడుగడుగునా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రజలు సీఎం జగన్‌కు ఘన స్వాగతం పలికారు. పరిపాలనను ప్రజల ముంగిటకు** తీసుకువచ్చి ఇంటికే పథకాలు అందిస్తున్న ప్రగతి రథ సారథిని చూసేందుకు ఎండను సైతం లెక్కచేయకుండా, రాత్రయినా తగ్గదేలేదంటూ ప్రతిపల్లె నుంచి ప్రజలు పరుగులు తీశారు. జననేత రాకతో ఊరూవాడా తిరునాళ్ల సందడి నెలకొంది.

- మేమంతా సిద్ధం బస్సుయాత్రకు ఘన స్వాగతం
- జననేత జగన్‌ను చూసి పులకించిన మెట్టసీమ ప్రజలు
- ఎండను సైతం లెక్కచేయని అభిమానం
- మెట్టలో పండగలా సాగిన యాత్ర

తుని: మేమంతా సిద్ధం బస్సుయాత్రలో భాగంగా తమ ప్రాంతానికి వస్తున్న జననేత జగన్‌మోహన్‌రెడ్డిని కనులారా చూసి తరించాలన్న తపనతో జాతీయ రహదారి వైపు ప్రజలు పరుగులు తీశారు. కాకినాడలోని అచ్చంపేట జంక్షన్ వద్ద మేమంతా సిద్ధం సభ ముగిసిన తర్వాత జననేత జగన్‌మోహన్‌రెడ్డి బస్సుయాత్ర జాతీయ రహదారుల మీదుగా కొనసాగింది. పిఠాపురం, గొల్లప్రోలు, చేబ్రోలు మీదుగా కత్తిపూడి చేరుకుంది. ప్రత్తిపాడు, జగ్గంపేట, తుని నియోజకవర్గాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అభిమాన నేతకు స్వాగతం పలికేందుకు వ్యయ ప్రయాసలను లెక్క చేయకుండా జాతీయ రహదారికి చేరుకున్నారు. జననేతను చూసి జైజగన్ అంటూ నినాదాలు చేశారు. జననేత ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు.

**బ్రహ్మరథం పట్టిన జనం**

తొండంగి మండలం బెండపూడి పంచాయతీ తమ్మయ్యపేట వద్ద మేమంతా సిద్ధం బస్సుయాత్ర తుని నియోజకవర్గంలోకి ప్రవేశించింది. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఆధ్వర్యంలో తుని, కోటనందూరు, తొండంగి మండలాలకు చెందిన అభిమానులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. దారి పొడుగునా మహిళలు, అభిమానులు నీరాజనం పట్టారు. సీఎం జగన్ బస్సులో నుంచి అందరికీ అభివాదం చేశారు. అడుగడుగునాజనం సందోహం రోడ్డుపైకి రావడంతో బస్సుయాత్ర ముందుకు సాగడానికి చాలా సమయం పట్టింది. జాతీయ రహదారి స్వాగత బ్యానర్లు, ఫ్లెక్సీలు, జెండాలతో నిండిపోయింది. తుని మండలం తేటగుంట, తిమ్మాపురం, ఎర్రకోనేరు మీదుగా వెలమకొత్తూరు డిగ్రీ కళాశాల వరకూ యాత్ర పండగలా సాగింది. జననేత రాత్రి 9 గంటలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో యాత్ర ముగించుకుని అనకాపల్లి జిల్లాలోకి అడుగు పెట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర పెరిక కార్పొరేషన్ చైర్మన్ పురుషోత్తం గంగాభవానీ, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత, మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి, తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, ఎంపీపీలు లగుడు శ్రీనివాస్, డాక్టర్ బొప్పన రాము, జెడ్పీటీసీ సభ్యురాలు పోతల సూర్యామణి, లోవదేవస్థానం చైర్మన్ గొర్రి అచ్చియ్యనాయుడు, మాజీ చైర్మన్లు లాలం బాబ్జి, బొంగు ఉమారావు, ఏఎంసీ మాజీ చైర్మన్ కొయ్యా మురళీ, మూడు మండలాలకు చెందిన పార్టీ అధ్యక్షులు చింతకాయల చినబాబు, దుంగల నాగేశ్వరరావు, రేలంగి రమణాగౌడ్, మాజీ అధ్యక్షుడు పోతల రమణ, వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు, డీసీసీబీ డైరెక్టర్ పోలిశెట్టి సోమరాజు, తుని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు సకురు నాగేంద్ర నెహ్రూ, ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు పోతుల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రత్తిపాడు నియోజకవర్గంలో..**

ఏలేశ్వరం: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న మేమంతా సిద్ధం బస్సుయాత్రకు శుక్రవారం ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఘన స్వాగతం లభించింది. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని నలుమూలల నుంచి వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కత్తిపూడి వద్ద సీఎం జగన్‌కు నీరాజనం పలికారు. తామంతా మీ వెంటే ఉన్నామని సీఎం జగన్‌కు భరోసా కల్పిస్తూ నినాదాలు చేశారు. మహిళలు సైతం సీఎం జగన్‌ను చూసేందుకు భారీగా తరలివచ్చారు. సీఎం జగన్ పార్టీ శ్రేణులు, ప్రజలకు బస్సులో నుంచి అభివాదం చేస్తూ ముందుకు సాగారు. జననేత రాకతో నియోజకవర్గంలో పండగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్, ఎంపీపీ పర్వత రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

**ఉరకలేసిన ఉత్సాహం**

తుని రూరల్: మండలంలో సీఎం జగన్ మేమంతా సిద్ధం బస్సుయాత్రకు ఘన స్వాగతం లభించింది. తుని, కోటనందూరు, తొండంగి మండలాల నుంచి వేలాదిగా తరలివచ్చిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు ఘన స్వాగతం పలికారు. మహిలలు బూడిద గుమ్మడి కాయలతో హారతులు ఇచ్చారు. తేటగుంట, రాజులకొత్తూరు, ఎర్రకోనేరు, చేపూరు, వెలంపేట జంక్షన్, జగన్నాథగిరి జంక్షన్ మీదగా బస్సు యాత్ర కొనసాగింది. బస్సులో నుంచి సీఎం జగన్‌తో పాటు కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, తుని ఎమ్మెల్యే అభ్యర్థి, రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. కార్యకర్తలు, అభిమానుల్లో ఉత్సాహం ఉరకలేసింది.



తుని బస్సుయాత్రకు వచ్చిన ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం జగన్



కత్తిపూడిలో ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం జగన్, వరుపుల సుబ్బారావు

**సిద్ధం సభకు భారీగా తరలిన నేతలు**

తుని రూరల్/కోటనందూరు/తొండంగి: జిల్లాలోని అచ్చంపేట జంక్షన్‌లో శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన మేమంతా సిద్ధం బహిరంగ సభకు తుని నియోజకవర్గంలోని తుని, కోటనందూరు, తొండంగి మండలాల నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా బయలుదేరి వెళ్లారు. రోడ్లు, భవనాలశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ తుని ఎమ్మెల్యే అభ్యర్థి దాడిశెట్టి రాజా ఆధ్వర్యంలో వేలాది మంది నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక బసులు, ఇతర వాహనాల్లో తరలి వెళ్లారు.

**కోటనందూరు మండలం నుంచి**

కోటనందూరు మండలం నుంచి సుమారు రెండు వేల మంది వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు 30 బస్సులు, ఇతర వాహనాల్లో తరలివెళ్లారు. ఎంపీపీ లగుడు శ్రీనివాసు, తుని ఏఎంసీ వైస్ చైర్మన్ వెలగా వెంకటకృష్ణాజీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, ఏపీబీ జిల్లా చైర్మన్ లంక ప్రసాద్, లోవదేవస్థానం మాజీ చైర్మన్ బొంగు ఉమారావు తదితరులు పాల్గొన్నారు.

**కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం ఆధ్వర్యంలో..**

కిర్లంపూడి: అచ్చంపేట జంక్షన్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం నిర్వహించిన సిద్ధం బహిరంగ సభకు మండలం నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు బయలుదేరి వెళ్లారు. కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం ఆధ్వర్యంలో కిర్లంపూడి నుంచి సుమారు 100 కార్లలో భారీ ర్యాలీగా తరలివెళ్లారు.

**శంఖవరం మండలం నుంచి..**

శంఖవరం: మండలం నుంచి ఎంపీపీ పర్వత రాజబాబు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు బస్సులు, ప్రత్యేక వాహనాల్లో ర్యాలీగా సిద్ధం సభకు తరలివెళ్లారు. ఎంపీపీ పర్వత రాజబాబు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.




సూరంపాలెంలో భారీ బ్యానర్‌తో సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న ఆదిత్య యూనివర్సిటీ విద్యార్థులు



సూరంపాలెంలో విద్యార్థులకు అభివాదం చేస్తున్న సీఎం జగన్.. చిత్రంలో ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ సతీష్‌రెడ్డి

## థ్యాంక్యూ సీఎం సార్

**600 అడుగుల బ్యానర్‌తో ఘన స్వాగతం పలికిన విద్యార్థులు**

గండేపల్లి: ఉచిత విద్య, ఉన్నత చదువులను ప్రోత్సహిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కాకినాడ జిల్లా గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీ విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. మండలంలోని రామేశంపేట, ఏడీబీ రోడ్డు మీదుగా శుక్రవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం బస్సు సాగింది. సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ముఖద్వారం వద్ద భారీ బ్యానర్‌తో సీఎం జగన్‌కు స్వాగతం కలికారు. జగనన్న మీ ఆరోగ్యం జాగ్రత్త, ఆల్ ది బెస్ట్ సార్.. అంటూ విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శించారు. అక్కడే ఉన్న ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ ఎస్.సతీష్‌రెడ్డిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన వాహనంలోకి పిలిచి కొద్దిసేపు ముచ్చటించారు. పార్టీ నేత గుత్తుల గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి మాస కల్యాణోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో పండితులు స్వామి, అమ్మవార్లకు కల్యాణం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము దంపతులు, పలువురు భక్తులు స్వామివారిని దర్శించి పూజలు చేశారు.

**స్వామి, అమ్మవార్లను దర్శించిన మంత్రి రాజా సతీమణి**

ఎస్.అన్నవరంలో కొలువైన ప్రసన్న వేంకటేశ్వరస్వామి, కుమ్మరిలోవలో తపోవనం ఆశ్రమంలో రాజరాజేశ్వరి అమ్మవారిని రోడ్లు భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా సతీమణి లక్ష్మీచైతన్య, తుని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి ఆశీస్సులు పొందారు.



సరస్వతీమహాస్వామి ఆశీస్సులు పొందుతున్న లక్ష్మీచైతన్య

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

గండేపల్లి: జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానిక పోలీసులు, హైవే మెయింటినెన్స్ సిబ్బంది వివరాల ప్రకారం.. మండలంలోని మురారి శివారు రాజమహేంద్రవరం వైపు నుంచి జగ్గంపేట వైపు వస్తున్న సుమారు 45 ఏళ్ల వయస్సు గల వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పెద్దాపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్టు స్థానిక ఎస్సై ఎన్.రామకృష్ణ తెలిపారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

## రత్నగిరికి పోటెత్తిన భక్తులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ఆలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. గత రెండు రోజులుగా స్వామివారి సన్నిధిలో పెద్ద సంఖ్యలో వివాహాలు జరుగుతుండడంతో ఆలయ ప్రాంగణంలో నవ దంపతుల సందడి నెలకొంది. గురువారం రాత్రి, శుక్రవారం ఉదయం రత్నగిరిపై 50కి పైగా వివాహాలు జరిగాయి. ఇవే ముహూర్తాల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వివాహాలు చేసుకున్న వారు సైతం స్వామివారి ఆలయానికి తరలివచ్చారు. వీరంతా సత్యదేవుని వ్రతాలాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి ఆలయ ప్రాంగణం, క్యూ లైన్లు, వ్రతమండపాలు, విశ్రాంత మండపాలు నవదంపతులు, వారి బంధుమిత్రులతో కిక్కిరిసిపోయాయి. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకూ భక్తుల రద్దీ కొనసాగింది. సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించి పూజలు చేసినట్లు అధికారులు తెలిపారు. స్వామివారి వ్రతాలు రెండు వేలు జరిగాయి. స్వామివారి దర్శనానికి గంట, ప్రదక్షిణ దర్శనానికి అరగంట సమయం పట్టింది. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

**సత్యదేవునికి ఏకాదశి పూజలు**

ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం సత్యదేవుడు, అమ్మవారికి పండితులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఏడు గంటలకు స్వర్ణపుష్పార్చన, తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకు కుంకుమార్చన నిర్వహించారు.

# వైఎస్సార్ సీపీ అభ్యర్థి 'వరుపుల' నామినేషన్

- భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు
- ప్రత్తిపాడులో సందడి వాతావరణం

ప్రత్తిపాడు: వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థిగా వరుపుల సుబ్బారావు శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. స్థానిక జాతీయ రహదారిలోని బీబీఆర్ గార్డెన్స్ నుంచి అటవీశాఖ చెక్‌పోస్టు, మెయిన్ రోడ్డు, అల్లూరి సీతారామరాజు జంక్షన్ మీదుగా నియోజకవర్గం నలుమూలల నుంచి భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులతో నేరుగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వెళ్లారు. ఎమ్మెల్సీ అనంత ఉదయ్ భాస్కర్ (అనంతబాబు), శంఖవరం ఎంపీపీ పర్వత రాజబాబు, వరుపుల సూరిబాబు, ప్రతిపాదకుడు తాళ్లూరి గొల్లాజీరావులతో కలిసి వెళ్లిన వరుపుల నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్రీనివాసరావుకు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, ఎంపీపీ గోర్ల కాంతి సుధాకర్, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బెహరా దొరబాబు, వరుపుల చిట్టిబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, పార్టీ నాయకులు గుడాల వెంకటరత్నం, కొండపల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

**బ్రహ్మరథం పట్టిన ప్రజలు**

నామినేషన్ దాఖలు చేసేందుకు వచ్చిన వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు, ఎమ్మెల్యే అనంత ఉదయ్‌భాస్కర్ (అనంత బాబు)లకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. దారిపొడవునా ఘన స్వాగతం పలికారు. వేలాది మంది పార్టీ శ్రేణులతో కలిసి జాతీయ రహదారిపై అటవీశాఖ చెక్‌పోస్టు, మెయిన్‌రోడ్డు, అల్లూరి సీతారామరాజు జంక్షన్, మార్కెట్ మీదుగా ర్యాలీగా రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి 100 మీటర్ల దూరం వరకు తరలివచ్చారు. అక్కడి నుంచి వరుపుల మరో నలుగురితో కలసి కాలినడకన రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకుని నామినేషన్ దాఖలు చేశారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు, శంఖవరం ఎంపీపీలు గోర్ల కాంతి సుధాకర్, పర్వత రాజబాబు, ప్రత్తిపాడు జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, వైఎస్సార్ సీపీ నాయకులు పైలా బోస్, గుడాల వెంకటరత్నం, శేరు కృష్ణ, బెహరా దొరబాబు, ఆకుల వీరబాబు, కొండపల్లి అప్పారావు, బొబ్బిలి వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.




ఎమ్మెల్సీ అనంతబాబుతో కలిసి ఈఆర్వోకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న వరుపుల సుబ్బారావు

**వేలాదిగా తరలివచ్చిన నాయకులు**

ఏలేశ్వరం: వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు నామినేషన్ కార్యక్రమానికి నియోజకవర్గ వ్యాప్తంగా వేలాదిగా ప్రత్యేక వాహనాల్లో పార్టీ శ్రేణులు తరలివచ్చారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా జనం తరలిరావడంతో ప్రత్తిపాడు జనసంద్రంగా మారింది. ఎటు చూసినా వైఎస్సార్ సీపీ జెండాలే దర్శనమిచ్చాయి. ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు పిలుపు మేరకు నియోజకవర్గంలోని ఏలేశ్వరం, ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి మండలాల నుంచి మహిళలతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు నామినేషన్ కార్యక్రమానికి తరలివచ్చారు. ప్రతి గ్రామం నుంచి బస్సులు, మోటారు బైక్‌లపై ర్యాలీగా ప్రత్తిపాడుకు వచ్చారు. మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మీశివకుమారి, ఎంపీపీలు పర్వత రాజబాబు, గోర్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీలు బెహరా రాజరాజేశ్వరి, గొల్లు చినదివాణం తదితరులు పాల్గొన్నారు.

**ఇండిపెండెంట్ అభ్యర్థిగా లోవరాజు నామినేషన్**

తుని: తుని నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థిగా శుక్రవారం లాలం లోవరాజు నామినేషన్ దాఖలు చేసినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కేవీ రామలక్ష్మి తెలిపారు. కోటనందూరు మండలం కేఈ చిన్నాయిపాలెం గ్రామానికి చెందిన లోవరాజు రెండు సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేశారన్నారు. ఈయన పేరును పది మంది బలపరిచారన్నారు. ఎన్నికల నిబంధనలు ప్రకారం ప్రోపోజల్స్ చేసే వారిని మాత్రమే కేంద్రంలోకి అనుమతిస్తామని తెలిపారు. ఎన్నికల నియమావళికి సంబంధించిన బుక్‌లెట్‌ను అందజేసినట్టు తెలిపారు.



ప్రత్తిపాడులో పార్టీ శ్రేణుల సందడి



ఏలేశ్వరం నుంచి ర్యాలీగా తరలివస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

**నామినేషన్ వేసిన జ్యోతుల నెహ్రూ**

గండేపల్లి: టీడీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా జ్యోతుల నెహ్రూ శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. తన స్వగ్రామం ఇర్రిపాక నుంచి జగ్గంపేట చేరుకుని రావులమ్మ అమ్మవారిని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఈఆర్వో కార్యాలయానికి చేరుకుని నామినేషన్ వేశారు. టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, జనసేన ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ పాల్గొన్నారు.